సంతలో వసూళ్ల దందా

- బాన్సువాడ మేకల సంతలో తైబజార్ నిర్వాహకుల ఆగడాలు
- నకిలీ స్టాంప్‌లు తయారు చేసి వసూళ్లకు పాల్పడుతున్న వైనం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు



బాన్సువాడలో మేకల సంత



నకిలీ స్టాంప్‌లతో ఉన్న రశీదులు

బాన్సువాడ : మున్సిపల్ అధికారుల అండదండలు పాలకవర్గం ముఖ్య నాయకుడి సహకారంతో వసూళ్ల మాఫియా బరితెగించింది. నకిలీ స్టాంప్‌లు తయారు చేసి రసీదులపై స్టాంప్‌లు వేస్తూ దర్జాగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నించే వారిపై దాడులకు దిగుతున్న పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ తతంగమంతా బాన్సువాడ మేకల సంతలో చోటు చేసుకుంటుంది. మున్సిపల్ తైబజారులో వేలం పాట ద్వారా 2024–2025 మార్చి వరకు రూ. 42.93 లక్షలకు వేలం పాట పాడి మేకల సంతను దక్కించుకున్న కాంట్రాక్టర్ వసూళ్లకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. తైబజారు వేలం పాట నిర్వహించే క్రమంలో రోజు వారి సంత, పశువుల దాఖాలు, గొర్రెలు, మేకలకు రేట్లను నిర్ణయించి ఇంతే వసూలు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మున్సిపల్ అధికారులు నిర్ణయించిన రేట్లనే కాంట్రాక్టర్ వసూలు చేయాలి. మేకల సంతలో మేకలు విక్రయించే వ్యాపారుల వద్దనే మేకకు రూ. 60 చొప్పున వసూలు చేయాలని అధికారులు సూచించారు. కానీ తైబజారు దక్కించుకున్న కాంట్రాక్టర్ మరో పది మందిని ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని ఇష్టం వచ్చినట్లు వసూళ్లకు పాల్పడుతున్నారు. మేకలు అమ్మే వారి నుంచి రూ.100 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తే మేకలు కొనుగోలు చేసే వారి వద్ద ఒక్కో మేకకు రూ.100 నుంచి రూ.200 వసూలు చేస్తున్నారు. మేకలు కొనేవారికి నకిలీ స్టాంపులు వేసిన రసీదులు ఇస్తున్నారు. ఎందుకిలా వసూలు చేస్తున్నారని ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారు.

గురువారం బాన్సువాడ మేకల సంతలో బాన్సువాడకు చెందిన ఓ వ్యక్తి తన ఇంట్లో శుభకార్యం ఉందని మేకను కొనుగోలు చేసి తీసుకెళ్తుండగా మేకను కొనుగోలు చేసిన వ్యక్తి చుట్టు ఐదుగురు ప్రైవేటు మాఫియా రూ.100 ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో సదరు వ్యక్తి మేమేందుకు డబ్బులు ఇవ్వాలని ప్రశ్నించారు. దీంతో అక్కడున్న ఐదుగురు ప్రైవేటు మాఫియా సదరు వ్యక్తిపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. దీంతో వెంటనే సదరు వ్యక్తి మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్‌కు ఫోన్‌లో సమాచారం ఇవ్వగా 'ఐతే మాకేంటి' అని ఫోన్ కట్ చేశారని బాధితులు వాపోయారు.

రూ.200 వసూలు చేశారు



మా ఇంట్లో శుభకార్యం ఉందని రెండు మేకలు కొనుగోలు చేశాం. మేకకు వంద చొప్పున రూ. 200 ఇచ్చేంత వరకు వదిలిపెట్టాలేదు. ఎప్పుడో పండగలకు మేకలను కొనుగోలు చేస్తే మా వద్ద డబ్బులు వసూలు చేయడం శోచనీయం. మార్కెట్‌కు రావాలంటే భయమేస్తుంది. – సాయిలు, బీర్కూర్

ఇవ్వకపోతే గొడవే..



బాన్సువాడ మేకల సంతలో ఒక మేకను కొనుగోలు చేశాను. మేకకు రూ.100 ఇవ్వాలని అన్నారు. ఎందుకు ఇవ్వాలని అంటే ఇష్టం వచ్చినట్లు తిడుతున్నారు. ముగ్గురు నలుగురు వ్యక్తులు వచ్చి గొడవ చేస్తున్నారు. ఏ మార్కెట్‌లో కూడా ఇంత దౌర్జన్యం లేదు. బాన్సువాడలోనే ఉంది. – విజయ్‌క్రాంతి, బీర్కూర్

విచారణ చేయిస్తాం..

బాన్సువాడ మేకల సంతలో అధిక వసూళ్లకు పాల్పడిన కాంట్రాక్టర్‌పై విచారణ చేయిస్తా. మేకలు అమ్మే వారి వద్దే డబ్బులు వసూలు చేయాలని స్పష్టంగా చెప్పాం. కొనేవారి వద్ద వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. నకిలీ స్టాంపులపై విచారణ చేయిస్తాం. – శ్రీహరి రాజు, ఇన్‌చార్జి కమిషనర్, బాన్సువాడ

క్లుప్తంగా

మొక్కలను సంరక్షించాలి



కామారెడ్డి క్రైం : బల్దియా పరిధిలోని అడ్లూర్ శివారులో వనమహోత్సవంలో బాగంగా గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ మొక్కలు నాటారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెరువుగట్లు, ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కౌన్సిలర్‌లు రవి, తయ్యబ్ సుల్తానా, అన్వర్ హైమద్, పాత శివకృష్ణ మూర్తి, పిడుగు మమత పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో గురువారం బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. గ్రామానికి చెందిన యాదగిరి, వేణుగోపాల్, చంద్రశేఖర్, లింగయ్య, రాజిరెడ్డి, రాజమణికి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, శ్యాంరావు, రాంచంద్రం, శివాజీ, జలందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నరెందర్‌రెడ్డి తదితరులున్నారు.

నియామకం



లింగంపేట(ఎల్లారెడ్డి): ఏబీవీపీ లింగంపేట మండల కన్వీనర్‌గా అఖిల్‌ను నియమించినట్లు జిల్లా నాయకుడు నవీన్ తెలిపారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్‌గా ఎంపికైన అఖిల్ మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై నిరంతరం స్పందిస్తూ పోరాడుతానని వెల్లడించారు.

పౌష్టికాహారం పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి పౌష్టికాహారం అందజేశారు. ప్రభుత్వపరంగా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



భిక్కనూరు : బస్వాపూర్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన మూడు మండలాల హిందీ భాష ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో సీనియర్ హిందీ ఉపాధ్యాయులు గఫూర్ శిక్షక్ ను హిందీ భాషా ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. భాష ఉపాధ్యాయుల పదోన్నతుల సాధన కోసం గఫూర్ శిక్షక్ చేసిన కృషిని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కొనియాడారు. హిందీ భాష కాంప్లెక్స్ బస్వాపూర్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు జయదేవ్‌ను కూడా సన్మానించారు.

పాఠశాలలో పనుల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్) : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అమ్మ ఆదర్శ కమిటీ పనులను గురు వారం జీసీడీవో ఉమరాణి పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా 19 కస్తూర్బా విద్యాలయాలు ఉండగా 17 కస్తూర్బా ల్లో అమ్మ ఆదర్శ కమిటీ పనులు జరుగుతున్నాయన్నారు. ఎంఈవో దేవిసింగ్, సెక్టోరియల్ అధికారి అమర్‌సింగ్, పంచాయతీ రాజ్ డీఈ ఈ ప్రభాకర్, భాస్కర్‌గౌడ్ తదితరులున్నారు.

ఆస్పత్రిలో సిబ్బందిని నియమించాలి



దోమకొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ 30 పడకల క్లస్టర్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించేలా చొరవ చూపాలని గురువారం మాజీ జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సీతారం మధు, సింగిల్‌విండో డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ సంబురాలు





భిక్కనూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, మాచారెడ్డిలో..

ఎస్సీ వర్గీకరణ కోసం జరుగుతున్న ఉద్యమానికి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇవ్వడంపై జిల్లాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. – సాక్షి నెట్‌వర్క్



లింగంపేటలో..



బాన్సువాడలో..

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని రామక్కపల్లి, పోచారం గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను వివరించారు. ఆర్నెళ్ల వరకు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే తాగించాలని వారు చెప్పారు. గ్రామంలో బాలింతలు, చిన్నారులతో ర్యాలీలు చేపట్టారు. హెచ్‌ఎం మౌనిక, అంగన్‌వాడీ టీచర్లు పూలబాయి, ఏసుమణి, సురేఖ పాల్గొన్నారు.



రామక్కపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు

తల్లిపాలే దివ్యౌషధం..

కామారెడ్డి అర్బన్ : అప్పుడే పుట్టిన శిశువులకు తల్లి ముర్రుపాలు సంజీవనిగా పనిచేస్తుందని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు బాలకృష్ణ అన్నారు. గురువారం కామారెడ్డి పట్టణ పరిధిలోని లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించి గర్భిణులు, బాలింతలు, మహిళలను చైతన్యం చేశారు. తల్లిపాలు ఔషధంగా, ఆహారంగా పనిచేస్తుందని, వ్యాధులు రాకుండా కాపాడుతాయని వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు వైద్య ఉమారాణి, వి కల్పన, టిపద్మ, జి లలిత, ఆశవర్కర్లు జ్యోతి, అనురాధ, లక్ష్మి, మల్లీశ్వరి, ఏఎన్‌ఎం కవిత, మహిళా సంఘాల అధ్యక్షురాలు సంతోషి తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టం



భిక్కనూరు : బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని వైద్య ఆరోగ్య సిబ్బంది అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు కాచాపూర్, బస్వాపూర్ గ్రామాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలు తాగించాలని చెప్పారు. ఈ విషయంలో తల్లులు ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. సిబ్బంది పూజ, యాదమ్మ, మంజుల, ఆశా వర్కర్లు అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

విధి నిర్వహణలో బదిలీలు సహజమే..



ట్రెజరీ అధికారి సాయిబాబును సన్మానిస్తున్న విఠల్‌రావు



పెద్దకొడప్‌గల్ గురుకుల పాఠశాలలో..

కామారెడ్డి అర్బన్ : జిల్లా ట్రెజరీ అధికారి జి సాయిబాబు హైదరాబాద్‌కు బదిలీ అయిన సందర్భంగా గురువారం విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు గురువారం సన్మానం చేసి వీడ్కోలు పలికారు. ట్రెజరీ అధికారిగా సాయిబాబు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్టు విఠల్‌రావు, కార్యదర్శి గంగాగౌడ్, ప్రతినిధులు శ్యాంరావు, ఉపేందర్ తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు..

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న చైతన్య, వాసవి, విజయలక్ష్మి, రజిత, మీనాక్షి, లలిత ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఫార్మసిస్ట్ సంగమేశ్వర్ గౌడ్ బదిలీపై వెళ్లడంతో వైద్యాధికారులు, తోటి సిబ్బంది ఘనంగా సన్మానించారు. వైద్యాధికారులు, ఆశావర్కర్లు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఫార్మసిస్ట్ సంగమేశ్వర్‌గౌడ్‌కు సన్మానం

'ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు'



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ఆయిల్‌పాం ఫాం సాగుతో రైతులు అధికలాభాలు గడించవచ్చని విశ్వతేజ ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ అశోక్ పేర్కొన్నారు. 'మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ డ్రైవ్'లో భాగంగా నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద శివారులో ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వం ఎంతో చేయూతనిస్తుందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ పవన్, అసిస్టెంట్ క్లస్టర్స్ మేనేజర్స్ పరమేశ్వర్‌రెడ్డి, సాయికుమార్, అభ్యుదయ రైతులు సంజీవులు, భీంరావు, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థను నిలబెట్టాలి



కామారెడ్డి అర్బన్ : జ్ఞానం ఉన్న ప్రతిఒక్కరూ తమ తల్లిదండ్రులను ఆదరించాలని, కుటుంబ వ్యవస్థలను నిలబెట్టాలని పలువురు వేదపండితులు అన్నారు. గురువారం మధ్యాహ్నం కామారెడ్డి మండలం ఉగ్రవాయి సాయిమందిర ప్రాంగణంలో వేద పండితులు గంగవరం నారాయణశర్మ–రాజ్యలక్ష్మి 75వ వివాహ (వజ్రోత్సవ) ఉత్సవం జరిగింది. నారాయణశర్మ కుమారుడు వేదపండితులు జి.అంజనేయశర్మ–విజయలు రచించిన 'మాతా –పితృసేవన వ్రత పూజావిధి:'తులా పురషదాన ప్రయోగ సహితం పుస్తకాన్ని ఆవిష్కరించి దంపతులకు పుష్పతులాభారం, పుష్పాభిషేకం నిర్వహించారు. రామశర్మ, అంజనేయశర్మ, శంకరశర్మ, శారద,లక్ష్మి, నారాయణశర్మ శిష్య బృందం తదితరులున్నారు.

సీఎం క్షమాపణ చెప్పాల్సిందే..



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కామారెడ్డి క్రైం/సదాశివనగర్/రామారెడ్డి/బాన్సువాడ టౌన్ : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్‌ఎస్ నాయకులు గురువారం కామారెడ్డి లోని నిజాంసాగర్ చౌరస్తాలో సీఎం దిష్టి బొమ్మను దహనం చేశారు. సీఎం వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి ఏఎంసీ మాజీ చైర్మన్ పిప్పిరి వెంకట్, వైస్ చైర్మన్ కుంబాల రవి యాదవ్, కౌన్సిలర్లు నజీరుద్దీన్, కృష్ణాజి రావు, నాయకులు లక్ష్మీనారాయణ, కాసర్ల స్వామి, చెలిమెల భాను, మల్లేష్ యాదవ్, భూమేష్ యాదవ్, ఫిరోజ్, ఆరిఫ్, మన్సూర్, రాజేందర్, రమేష్, వెంకటిపాల్గొన్నారు. సదాశివనగర్‌లో, రామారెడ్డిలో, బా న్సువాడ పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో ధర్నా చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్

భిక్కనూరు : పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మండల బీజేపీ అధ్యక్షుడు రమేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు ఉప్పరి రమేశ్ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి కామారెడ్డి అసెంబ్లీ ఇంచార్జ్ కుంట లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథి విచ్చేసి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు నాగర్తి నరేందర్ రెడ్డి ఏనుగు శ్యాం రెడ్డి, వలకొండ సాయి రెడ్డి, పూస శంకర్, అరిగే నర్సింలు గంగాధరి రామచంద్రం ప్రధాన కార్యదర్శి ఏలేటి గణేష్ రెడ్డి అత్తెల్లి తిరుమలేష్ జిల్లా నాయకులు పాలకొండ శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

ఊపిరితిత్తుల క్యాన్సర్‌పై అవగాహన



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని దుర్కి గ్రామంలో గ్రామప్రజలకు ఊపిరితిత్తుల క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో నర్సింగ్ ప్రభుత్వ కళాశాలలో ఆధ్వర్యంలో నిర్వహించారు. వరల్డ్ లంగ్స్ క్యాన్సర్ డే సందర్భంగా గ్రామ ప్రజలకు ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. గవర్నమెంట్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఏఎన్‌ఎం ఉమ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ..

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శంకర్



దోమకొండ : దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా గురువారం శంకర్ బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన మహబూబ్‌నగర్ జిల్లా అమాన్‌గల్లు కళాశాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. అయనతో పాటు రికార్డ్ అసిస్టెంట్‌గా బదిలీపై అరిఫ్, మనోహర్ పటేల్, శ్రీరాంలు రాగా వారిని కళాశాల అధ్యాపకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కళశాల అధ్యాపకులు వసంత్‌కుమార్, శేషారావ్, రాజు, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా శోభారాణి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద మహిళ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శోభారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన రాధిక బదిలీపై వెళ్లారు. ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాలలో బాధ్యతలు చేపడుతున్న 16 మంది అధ్యాపకులను కూడా బదిలీ అయ్యారు.

రామారెడ్డి తహసీల్దార్‌గా సువర్ణ



రామారెడ్డి : రామారెడ్డి తహసీల్దార్‌గా కే సువర్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అక్కడ పనిచేసిన ఇన్‌చార్జి తహసీల్దార్ లక్ష్మణ్ స్థానంలో తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. బాన్సువాడ ఆర్డీవో అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్‌లో ఆమె గతంలో పనిచేశారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుక



ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న లింగంపేట నాయకులు

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు కాంగ్రెస్ నాయకులు తిమ్మారెడ్డి గ్రామ శివారులో ఘనంగా స్వాగతం పలికారు. కొత్త హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ఆవరణలో ఎమ్మెల్యేకు మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ వెంకట్రాంరెడ్డి దంపతులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. జెండారే జెండాపాట సీడీని ఆవిష్కరించారు. ఎమ్మెల్యేకు ఆర్డీవో ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాసులు శుభాకాంక్షలు తెలిపారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పుట్టినరోజు వేడుకలు లింగంపేట మండల కాంగ్రెస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్రనారాగౌడ్, యూత్ అధ్య క్షుడు సుప్పాల రాజు, ఎల్లమయ్య, విఠల్, సంతోష్‌రెడ్డి తదితరులున్నారు.

నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి రూరల్/తాడ్వాయి: నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాల్లో, ఎల్లారెడ్డి పట్టణంలోని మైనార్టీ స్కూల్, మైనార్టీ పాఠశాలల్లో, తాడ్వాయి మండలంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు బర్త్‌డే నిర్వహించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు మంత్రి పదవి రావాలని కోరుతూ తాండూర్ త్రిలింగేశ్వరాలయంలో సొసైటీ చైర్మన్ గంగారెడ్డి పూజలు చేశారు.

సంక్షిప్తం

నేడు ఎక్సైజ్ ఆఫీస్‌లో బైక్‌ల వేలం

దోమకొండ : మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం రెండు బైక్‌లు, ఒక సైకిల్‌ను వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎక్సైజ్ కేసుల్లో గతంలో వీటిని సీజ్ చేసినట్లు ఆయన వివరించారు. బైక్ విలువ రూ. 3 వేలు, సైకిల్ విలువ రూ. 2 వేలుగా వేలం పాటలో వేస్తున్నట్లు ఆయన వివరించారు.ఆసక్తి గల వారు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే వేలానికి హాజరు కావాలని ఆయన కోరారు.

గ్రంథాలయానికి కొత్త పుస్తకాలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయానికి గురువారం కొత్తగా సాహిత్య పుస్తకాలు వచ్చినట్లు ఇన్‌చార్జి లైబ్రేరియన్ రాజలింగం తెలిపారు. రాజరామ్మోహన్‌రాయ్ ఫౌండేషన్ నుంచి జిల్లా గ్రంథాలయానికి వచ్చిన పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి తాడ్వాయికి పంపించారన్నారు. తెలంగాణ సాహిత్య, చరిత్ర, వర్తమాన చరిత్ర, భారతీయ సంస్కృతి, జనహిత తదితర పుస్తకాలు వచ్చాయని, ఈ పుస్తకాలు పాఠకులకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి



పిట్లం(జుక్కల్) : జీపీ పరిధిలో గురువారం అధికారులు డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా జీపీ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ఇళ్లలోని కుండీల్లో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తూ, నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ, వైద్య, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటిని అరికట్టాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : కలుషిత నీటిని అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మండలంలోని చావుని తండా శివారులో మిషన్ భగీరథ నీరు లీకేజీ అవుతోంది. మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో పలు గ్రామలకు వెళ్లే మిషన్ భగీరథ నీరు కలుషితమవుతున్నాయని అవేదన చేందుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్, ఆయిల్ చోరీ

బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ శివారులోని పంటపొలాల్లో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు కాపర్ వైరు, ఆయిల్‌ను గురువారం చోరీ చేశారు. బుధవారం సాయంత్ర 6 వరకు తాను పొలం వద్దే ఉన్నానని గురువారం ఉదయం పంటకు నీరుపెడదామని బోరు వేయగా ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్ చోరీకి గురైనట్లు గుర్తించినట్లు రైతు రైతు నాగేశ్వరరావు తెలిపారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ పేర్కొన్నారు.